కార్తీక్ పసిడి జోరు

ఆసియా పవర్ లిఫ్టింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కిర్గిస్థాన్ వేదికగా జరుగుతున్న ఆసియా ఓపెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ లిఫ్టర్ కార్తీక్ పసిడి పతకాలతో మెరిశాడు. సోమవారం జరిగిన అండర్-17 యూత్ 75కిలోల విభాగం ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో కార్తీక్ స్వర్ణం, డెడ్ లిఫ్ట్‌లో పసిడి పతకం సాధించాడు. ఓవరాల్‌గా 370కిలోల బరువెత్తిన కార్తీక్..డెడ్‌లిఫ్ట్‌లో 150కి, స్క్వాట్‌లో 140కి, బెంచ్‌ప్రెస్‌లో 80కి బరువెత్తి సత్తాచాటాడు. డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు రేఖ, కోచ్ నిఖిల్..కార్తీక్‌ను అభినందించారు.

క్వార్టర్స్‌లో నిశాంత్

బుస్టో అర్సిజియో(ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ బ్యాక్సింగ్ క్వాలిఫయర్ టోర్నీలో భారత యువ బాక్సర్ నిశాంత్ సత్తాచాటుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల 71కిలోల ప్రిక్వార్టర్స్ బౌట్‌లో నిశాంత్ 5-0 తేడాతో క్రిస్టోస్ కరాటిస్(గ్రీస్) అలవోక విజయం సాధించాడు. గతేడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన ఈ 23 ఏండ్ల యువ బాక్సర్..గ్రీస్ బాక్సర్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆది నుంచి తనదైన దూకుడు ప్రదర్శించిన నిశాంత్ పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. గ్రీస్ బాక్సర్‌కు ఎక్కడా అవకాశమివ్వకుండా రౌండ్ రౌండ్‌కు తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయాడు. క్వార్టర్స్‌లో అమెరికా బాక్సర్ ఒమరీ జోన్స్‌తో నిశాంత్ తలపడుతాడు. ఇదే టోర్నీలో ఇప్పటికే దీపక్ బోరియా, హుసాముద్దీన్ నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

ముంబై ఆధిక్యం 260

ముంబై: ముంబై, విదర్భ మధ్య రంజీ ట్రోఫీ ఫైనల్ ఆసక్తికరంగా సాగుతున్నది. రికార్డు స్థాయిలో 42వ సారి టైటిల్‌పై కన్నేసిన ముంబై ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్నది. విదర్భ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. ఓపెనర్లు పృథ్వీషా (11), భూపేన్ లల్వాణి (18) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగినా..కెప్టెన్ రహానే(58 నాటౌట్), ముషీర్‌ఖాన్(51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో రాణించారు. ఈ సీజన్‌లో ఫామ్‌లేమితో తీవ్రంగా సతమతమవుతున్న రహానే ఫైనల్ పోరులో స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించాడు. యువ బ్యాటర్ ముషీర్ జతగా రహానే సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఈ ఇద్దరు పోటాపోటీగా బౌండరీలు బాదడంతో ముంబై ప్రస్తుతం 260 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నది. యశ్ ఠాకూర్, హర్ష్‌దూబే ఒక్కో వికెట్ తీశారు. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 31/3తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన విదర్భ 105 కుప్పకూలింది. యశ్ రాథోడ్ (27) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ధవల్ కులకర్ణి(3/15), తనుశ్ (3/7), శమ్స్ ములానీ (3/32) మూడేసి వికెట్లు తీశారు.

మహిళల ప్రీమియర్ లీగ్

సూపర్ శబ్నమ్

మూడు వికెట్లతో విజృంభణ • యూపీపై గుజరాత్ విజయం

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఢిల్లీ-బెంగళూరు మ్యాచ్‌కు కొనసాగింపు అన్నట్లు యూపీ-గుజరాత్ నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే ప్రతీ పోరు కీలకమైన నేపథ్యంలో విజయమో, వీరస్వర్గమో అన్న రీతిలో తుదికంటా పోరాడుతున్నారు. తెలుగు యువ పేసర్ శబ్నమ్ షకీల్ ధాటికి యూపీ ఓటమి వైపు నిలిచింది. దీప్తిశర్మ అజేయ అర్ధసెంచరీతో చెలరేగినా.. యూపీని గెలిపించలేకపోయింది. యూపీపై గుజరాత్ గెలుపుతో ప్లేఆఫ్స్ రేసు రసకందాయంలో పడింది. మిగిలిన రెండు బెర్తుల కోసం మూడు జట్లు పోటీపడుతున్నాయి.

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో ప్లేఆఫ్స్ రేసు జోరందుకుంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై తమ బెర్తులను ఖరారు చేసుకోగా, మిగిలిన స్థానాల కోసం బెంగళూరు, యూపీ, గుజరాత్ పోటీపడుతున్నాయి. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో యూపీ నిరాశపరిచింది. సోమవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో యూపీ 8 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓటమి పాలైంది. గుజరాత్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యఛేదనలో యూపీ 144/5 స్కోరుకు పరిమితమైంది. ఏపీ యువ పేసర్ శబ్నమ్ షకీల్(3/11) ధాటికి యూపీ ఆదిలోనే కీలక వికెట్లు కోల్పోయింది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ(60 బంతుల్లో 88 నాటౌట్ 9ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది. అంతకుముందు నిర్ణీత 20 ఓవర్లలో గుజరాత్ 152/8 స్కోరు చేసింది. కెప్టెన్ బేత్ మూనీ(52 బంతుల్లో 74 నాటౌట్, 10 ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో రాణించగా, లారా వోల్‌వర్డ్(43) ఆకట్టుకుంది. దీప్తిశర్మ రెండు వికెట్లు తీసింది. ఏపీకి చెందిన 16 ఏండ్ల శబ్నమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

శబ్నమ్ విజృంభణ:

గుజరాత్ నిర్దేశించిన లక్ష్యఛేదనకు దిగిన యూపీకి ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బలు తగిలాయి. తొలి ఓవర్లోనే శబ్నమ్..కెప్టెన్ అలిసా హీలీ(4), చమరి ఆటపట్టు(0) ఔట్ చేసి యూపీ పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. వీరిని అనుసరిస్తూ కిరణ్ నవగిరె(0)ను క్యాథరిన్ డాకౌట్ చేయగా, ఫామ్‌లో ఉన్న గ్రేస్ హ్యారిస్(1) కూడా నిరాశపరిచింది. దీంతో 16/4 స్కోరుతో కష్టాల్లో కూరుకుపోయిన దశలో దీప్తిశర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజానెత్తుకుంది. దీప్తికి మద్దతు ఇస్తుందనుకున్న శ్వేతా సెహ్రావత్(8)ను శబ్నమ్ పెవిలియన్‌కు పంపడంతో యూపీ కష్టాలు మరింత పెరిగాయి. ఈ తరుణంలో దీప్తి తాను ఉన్నానంటూ బ్యాటు ఝుళిపించింది. పూనమ్ ఖెమ్నార్ మద్దతుతో దీప్తి ఆకాశమే హద్దుగా చెలరేగింది. ఎదురైనా బౌలర్‌నల్లా బాదుతూ లక్ష్యాన్ని అంతకంతకూ కరిగించుకుంటూ పోయింది. ఈ క్రమంలో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న దీప్తి..విజయంపై కన్నేసింది. యూపీ గెలుపునకు చివరి 18 బంతుల్లో 43 పరుగులు అవసరమయ్యాయి. 18వ ఓవర్లో మేఘనా సింగ్ మూడే పరుగులు ఇచ్చుకుంది. తనూజ వేసిన తర్వాత ఓవర్లో ఖెమ్నార్ రెండు ఫోర్లు సహా 14 పరుగులు రాబట్టింది. దీంతో చివరి ఓవర్లో 26 పరుగులు అవసరమయ్యాయి. దీప్తి రెండు భారీ సిక్స్‌లకు తోడు రెండు సింగిల్స్ తీయడంతో చివరి రెండు బంతులకు 10 పరుగులు అవసరమైన దశలో రెండు పరుగులే రావడంతో యూపీ ఓటమి ఖాయమైంది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 152/8 (మూనీ 74 నాటౌట్, వోల్‌వర్డ్ 43, ఎకల్‌స్టోన్ 3/38), **యూపీ:** 20 ఓవర్లలో 144/5 (దీప్తిశర్మ 88 నాటౌట్, శబ్నమ్ 3/11)

రుద్రాంశ్‌కు రజతం

పారా షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారా షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. సోమవారం జరిగిన మిక్స్‌డ్ 50మీటర్ల పిస్టల్(ఎస్‌హెచ్1) విభాగంలో రుద్రాంశ్ ఖండేల్‌వాల్ రజత పతకంతో మెరిశాడు. ఇదే విభాగంలో పోటీపడ్డ నిహాల్‌సింగ్ కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికే పారిస్ పారాలింపిక్స్ బెర్తు దక్కించుకున్న రుద్రాంశ్ ఫైనల్లో 223.2 స్కోరుతో రెండో స్థానంలో నిలువగా, డేవిడ్ ఫ్రాన్సెట్టి (ఇటలీ) 230 పసిడి ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు మిక్స్‌డ్ 50మీటర్ల పిస్టల్ (ఎస్‌హెచ్1) టీమ్ ఈవెంట్‌లో రుద్రాంశ్, నిహాల్ సింగ్, సింగ్‌రాజ్ త్రయం వెండి పతకం దక్కించుకోగా, చైనా బృందం స్వర్ణం సొంతం చేసుకుంది.

సెప్టెంబర్‌లో షమీ రిటర్న్

ధర్మశాల: భారత స్టార్ పేసర్ మహమ్మద్ షమీ గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీలమండ గాయానికి ఇటీవలే శస్త్రచికిత్స చేయించుకున్న షమీ..సెప్టెంబర్‌లో స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ కార్యదర్శి జై షా సోమవారం పేర్కొన్నాడు. వన్డే ప్రపంచకప్ సందర్భంగా షమీ గాయపడ్డ సంగతి తెలిసిందే.

ఫార్ములా-ఈతో ఎఫ్ఐఎం జట్టు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రపంచంలోనే తొలి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ రేస్ సిరీస్ అయిన ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్ కప్..ఏబీబీ ఫార్ములా-ఈ రేస్ వరల్డ్ చాంపియన్‌షిప్‌తో జట్టు కట్టనుంది. ఏప్రిల్‌లో 13, 14తేదీల్లో మిసానోలో జరుగనున్న ఫార్ములా-ఈ రేసు సందర్భంగా ఇరు వర్గాలకు చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోనున్నాయి. భారత మోటర్ రేసింగ్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని ఇండీ రేసింగ్ టీమ్ సీఈవో అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. నాలెడ్జ్ షేరింగ్‌పై జరిగే చర్చలోతాము పాల్గొంటుందన్నారు.

ఆసీస్‌దే టెస్టు సిరీస్

క్యారీ, మార్ష్ విజృంభణ

క్రైస్ట్‌చర్చ్: టెస్టుల్లో ఆస్ట్రేలియా జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఈ సీజన్‌లో వెస్టిండీస్‌తో ఓటమి మినహాయిస్తే..పాకిస్థాన్, న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లను ఆసీస్ క్లీన్‌స్వీప్ చేసింది. కివీస్‌తో సోమవారం ముగిసిన రెండో టెస్టులో ఆసీస్ 3 వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 77/4 నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ 7 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసింది. 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో మిచెల్ మార్ష్(80), అలెక్స్ క్యారీ(98 నాటౌట్) అర్ధసెంచరీలతో జట్టు విజయంలో కీలకయ్యారు. కివీస్ బౌలింగ్ దాడిని నిలువరిస్తూ వీరిద్దరు సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. ఓవైపు పిచ్ స్పింగ్‌కు సహకరిస్తున్నా..వెరవకుండా లక్ష్యం వైపు అడుగులు వేశారు. మార్ష్ ఔటైనా..కెప్టెన్ కమిన్స్(32 నాటౌట్)తో కలిసి క్యారీ జట్టును విజయతీరాలకు చేర్చాడు. క్యారీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', హెడ్‌కి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

వినేశ్ ట్రయల్స్‌లో గందరగోళం

పటియాల: ఏషియన్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం నిర్వహించిన ట్రయల్స్‌లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ రెండు వేర్వేరు బరువు కేటగిరీల్లో బరిలోకి దిగడంతో పాటు డోపింగ్ పరీక్షలకు నిరాకరించడం వివాదం రేపింది. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన వినేశ్..సోమవారం జరిగిన ట్రయల్స్‌లో శివానీపై 11-6తో గెలిచి కిర్గిస్థాన్‌లో జరిగే క్వాలిఫయర్స్ టోర్నీకి అర్హత సాధించింది.

దక్షిణాఫ్రికా సీనియర్ క్రికెటర్ డేవిడ్ మిల్లర్ వివాహబంధంలోకి అడుగుపెట్టాడు. తన స్నేహితురాలు కమిల్లా హ్యారిస్‌ను మిల్లర్ పెండ్లాడాడు. ఈ వేడుకకు మిల్లర్, హ్యారిస్ కుటుంబసభ్యులు హాజరయ్యారు.